ప్రజాశక్తి
బుధవారం 31 జనవరి 2024
8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా






టీచర్లను స్కూల్లో పెట్టి తాళాలు

- విద్యార్థులు, తల్లిదండ్రుల వినూత్న నిరసన
- పర్మినెంట్ టీచర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - విస్సన్నపేట : ఎన్‌టిఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నూతిపాడు గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో టీచర్లను విద్యార్థులు, తల్లిదండ్రులు లోపల పెట్టి తాళాలు వేసిన సంఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో 58 మంది విద్యార్థులు చదువుతున్నా ఒక్క పర్మినెంట్ టీచర్ కూడా లేకపోవడంతో వారు ఈ విధంగా నిరసన వ్యక్తం చేశారు. రోజుకొక టీచర్ డిప్యూటేషన్‌పై వచ్చి విద్యార్థులకు చదువులు చెబుతున్నారు. వారు కూడా సక్రమంగా రావటం లేదు. గతంలో ఇదే పాఠశాలలో 120 మందికి పైగా విద్యార్థులు చదువుకొనేవారు. పర్మినెంట్ టీచర్లు లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. తమ పాఠశాలకు పర్మినెంట్ టీచర్లు కావాలని 8 నెలల నుండి ఎంఇఒ, డిఇఒల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదని, అందుకే తమ పిల్లలతో కలిసి టీచర్లను లోపల పెట్టి తాళాలు వేశామని తల్లిదండ్రులు చెప్పారు. అప్పుడైనా తమ పాఠశాల సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తిరువూరు సిఐ నభి, విస్సన్నపేట ఎస్‌ఐ సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. తలుపులు తెరిపించి టీచర్లను బయటకు తీసుకువచ్చారు. అక్కడకి వచ్చిన మండల విద్యాశాఖాధికారిని తల్లిదండ్రులు నిలదీశారు. మీకు ఎన్నిసార్లు చెప్పినా సమస్యను పరిష్కరించలేదని, మీరు పాఠశాలలోకి రావొద్దని అడ్డుకున్నారు. దీంతో సిఐ, ఎస్‌ఐ ఎలాంటి గొడవలు జరగకుండా అందరికి సర్దిచెప్పి పంపివేశారు.



స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు సర్దిచెబుతున్న సిఐ, ఎస్‌ఐ

గరంగరం

- విపక్ష, అధికారపక్షాల వాగ్వాదం
- టిడ్కో గృహాలు ఎప్పుడిస్తారని విపక్ష సభ్యుల ప్రశ్న
- దోమలు, వీధి కుక్కల స్వైరవిహారంపై ఆగ్రహం
- పలు సమస్యలపై నిలదీసిన సిపిఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు
- మొత్తం 121 అంశాలపై చర్చ
- విపక్షాలకు అవకాశం ఇవ్వని మేయర్


విఎంసి కౌన్సిల్ సమావేశంలో సభ్యుల వాగ్వాదం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఏకపక్షంగా సాగింది. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికార వైసిపి సభ్యులకు, టిడిపి, సిపిఎం సభ్యులకూ మధ్య వాదోపవాదాలు జరిగాయి. సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, 13వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ తదితరులు అజెండాలో ఉన్న అంశాలపై ప్రశ్నించగా, మేయర్‌తో పాటు అధికార పక్షం కార్పొరేటర్లు పక్కదోవ పట్టించేవిధంగా వ్యవహరించారు. దీంతో అధికారపక్ష సభ్యుల తీరుపై విపక్ష సభ్యులు మండిపడ్డారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు టిడ్కో ఇళ్లపై ప్రశ్నించారు. నిర్మించిన ఇళ్లెన్ని, లబ్ధిదారులెందరు? అభివృద్ధి పనులు ఏమేమి పూర్తిచేశారు, వారికి గృహాలు ఎప్పుడు కేటాయిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఐదేళ్ల కాలపరిమితి కూడా పూర్తవుతోందన్నారు. టిడ్కో ఇళ్ళ కోసం చాలామంది లబ్ధిదారులు అప్పులు చేసి మీ డబ్బులు కట్టారన్నారు. లబ్ధిదారులు అప్పులపాలయ్యారన్నారు. దీనిపై మేయర్ సమాధానం చెబుతూ డ్రైనేజీ, వాటర్ లైన్లు వంటి కొన్ని అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని, వాటిని పూర్తిచేసి గృహాలను లబ్ధిదారులకు అందిస్తామని బదులిచ్చారు. నగరంలో కుక్కల బెడద ఎక్కువైందని, దీంతో చిన్నారులు చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, వీధి కుక్కల నివారణకు నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ సమావేశాలు జరగలేదని విపక్ష సభ్యులతోపాటు అధికారపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి కుక్కల బారినుండి నగర ప్రజలను రక్షించాలని నిర్ధిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మేయర్ బదులిస్తూ... కుక్కల పెంపకందారులు కేసులు వేస్తున్నారన్నారు. అయినా కుక్కలకు యానిమల్ బర్త్ ఆపరేషన్లు చేసేవిధంగా కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విఎంసి వాటర్ సప్లయ్, డ్రైనేజీ విభాగాల్లో సిబ్బంది కొరత లేకుండా కార్మికులను నియమించాలని విపక్ష సభ్యులు కోరారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందిని ఆప్కాస్‌లో నమోదు చేయాలని, ప్రతి నెలా వారి వేతనాల నుండి రికవరీ చేస్తున్న పిఎఫ్, ఇఎస్‌ఐ డబ్బులు సంబంధిత శాఖలకు సక్రమంగా జమయ్యేటట్లు చర్యలు చేపట్టాలని కోరారు. మన బడి నాడు - నేడు పథకం కింద చేపట్టిన పనులు నేటికీ కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి కాలేదని విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదుల నిర్మాణాలు ఆగిపోయాయని, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. మేయర్, కమిషనర్ స్పందించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు (మిగతా 6లో)


దోమలు, మంచినీరు, టిడ్కో ఇళ్ల సమస్యలపై వినూతన్న నిరసన తెలుపుతున్న సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

జగనన్న కాలనీల్లో వసతులేవీ?

- తీరని నీటి కష్టాలు
- శాశ్వత నీటి వసతి అంచనా వ్యయం రూ.274 కోట్లు
- పూర్తయిన పనుల విలువ రూ.19.97 కోట్లు మాత్రమే
- మంజూరైన గృహాలు 89,824
- మూడేళ్లలో పూర్తయినవి 23,083

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మండల కేంద్రమైన బంటుమిల్లి జగనన్న కాలనీలో 625 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారు. ఈ కాలనీలో భూగర్భ జలాల్లో ఉప్పునీరు ఉండటంతో నిర్మాణ సమయంలో ఇళ్లను క్యూరింగ్ చేయడానికి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ట్యాంకు నీటికి రూ.400 నుంచి రూ.450 ఖర్చు చేశారు. కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మించినా మంచినీటి చెరువు నుంచి పైప్‌లైన్‌తో అనుసంధానం చేయలేదు. దీంతో కాలనీ వాసులు రోజువారీ తాగునీటి అవసరాలకు మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. కోడూరు మండలం కొత్తపాలెం గ్రామంలో 30 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. లబ్ధిదారుల్లో అత్యధికులు సమీపంలోని కాల్వ నీటిని ఉపయోగించుకుని గృహాలు నిర్మించుకున్నారు. అయితే రెండు కిలోమీటర్ల దూరంలోని జయపురం గ్రామం నుంచి తాగునీటిని తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ రెండు మండలాల్లోనే కాదు...తీర ప్రాంత మండలాల్లో భూగర్భంలో ఉప్పునీరు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో గృహ నిర్మాణాలకు, తాగునీటి అవసరాలకు నీటిని కొనుగోలు చేయాల్సివస్తోంది. ఈ మండలాల్లోని జగనన్న కాలనీల్లో శాశ్వత నీటి వసతి సమకూరలేదు. దీంతో కోడూరు, మచిలీపట్నం, నాగాయలంక తదితర మండలాల్లో జగనన్న కాలనీల్లో నివసిస్తున్న వేలాది మంది లబ్ధిదారులు నీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.


కోడూరు మండలం కొత్తపాలెంలో జగనన్న కాలనీ


బంటుమిల్లిలో జగనన్న కాలనీ

మాటలన్నీ నీటి మూటలే

జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. "నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు" పథకం కింద కాలనీల్లో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు నీటి కష్టాలు తీరడం లేదు. కాలనీలకు శాశ్వత నీటి సదుపాయం ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. అంతేగాక మంజూరైన గృహాల్లో నాలుగో వంతు గృహాల నిర్మాణం మాత్రమే పూర్తయింది.

శాశ్వత నీటి సదుపాయానికి కాంట్రాక్టు కమ్యూనిటీ

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా కాలనీల్లో శాశ్వత నీటి సదుపాయం కల్పించే నిమిత్తం 678 పనులకు రూ.274.04 కోట్లు ఖర్చవుతాయని రెండేళ్ల క్రితం అంచనా వేశారు. కానీ ఇప్పటికి రూ.19.97 కోట్ల విలువైన 24 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈనేపథ్యంలోనే తాజాగా కమ్యూనిటీ కాంట్రాక్టు (మిగతా 6లో)

ఎన్నికల ప్రక్రియపై అవగాహన అవసరం

శిక్షణ ముగింపులో కలెక్టర్ ఎస్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : రానున్న సార్వత్రిక ఎన్నికలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించేలా ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ శిక్షకులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచనల మేరకు ఈనెల 24 నుండి మంగళవారం వరకు ఎన్నికల ప్రక్రియలో భాగాలైన పోలింగ్, యంసిసి, ఐటి అప్లికేషన్స్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై నాలుగు రోజులపాటు నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లకు జిల్లా స్థాయి శిక్షకులతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు కార్యాచరణ పై కలెక్టర్ డిల్లీరావు దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో డిఆర్వో ఎస్.వి. నాగేశ్వరరావు, ఆర్డివో కె. మాధవి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ సిహెచ్ దుర్గాప్రసాద్, విశ్రాంత డిప్యూటి కలెక్టర్ చక్రపాణి, జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ఇఆర్వోలు, ఏఇఆర్వోలు, ఎలక్షన్ డిటిలు, తదితరలు పాల్గొన్నారు.



విజయవాడ కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు, చిత్రంలో డిఆర్ఒ నాగేశ్వరరావు, మాధవి, దుర్గాప్రసాద్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామం రమేష్ నగరులో నివాసం ఉంటున్న లెళ్ళ లక్ష్మి లతా శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధికి అప్లయ్ చేశారు. మంగళవారం వారి కుటుంబ సభ్యులకు లక్షా ఇరవై వేల చెక్‌ను ఎంపిపి పాలడుగు జ్యోత్స్న లబ్ధిదారునికి అందజేశారు.

సిపిసిసి కంపెనీ ఒప్పంద పత్రాలు అందజేత


పత్రాలు అందుకుంటున్న కార్మికులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని సిపిసిసి కంపెనీ, ముఠా కార్మికులకు మధ్య పారిశ్రామిక వివాదాల చట్టం సెక్షన్ 18(1) ప్రకారం ఇరుపక్షాల అంగీకారంతో అగ్రిమెంట్ చేశారు. మంగళవారం ఈ ఒప్పంద పత్రాలను కంపెనీ ప్రతినిధులు, సిఐటియు ప్రతినిధులు ముఠా కార్మికులకు అందజేశారు. ఇందులో ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్, ముఠా కార్మిక నాయకులు ఎన్.సూరిబాబు, సివిల్ కార్మికులు పి.కాంతారావు, జి.సాంబశివరావు, పి.వెంకటరత్నం, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌పై విజిలెన్స్ దాడులు



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌పై మంగళవారం పక్కా సమాచారంతో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన 870 లూజు సిమెంట్ బస్తాలను సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన నిర్వాహకుడు అప్పారావుపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారులు నిల్వలను డిప్యూటీ సిటిఒ వి.మహేష్ కుమార్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వసంత్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చీమలపాడు ఆలయంలో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న వేలి ముద్ర నిపుణులు

ప్రజాశక్తి - ఎ.కొండూరు : మండలంలోని చీమలపాడు అంకమ్మ మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవస్థానంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి ఆలయ ముఖ ద్వార తలుపులను, తాళాలను పగలగొట్టి, ఆలయంలోకి ప్రవేశించి, హుండీలో ఉన్న నగదు రూ.20 వేలు అపరించుకు పోయారు. విషయం తెలుసుకున్న ఆలయ ఛైర్మన్ మరీదు జమలయ్య, కమిటీ సభ్యులు మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లి పరిశీలించగా గుడి తలుపులు తాళాలు పగలగొట్టి ఉన్నాయని, హుండీలో ఉన్న నగదు రూ.20వేలను అపహరించుకొని పోయారని, విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ జమలయ్య విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికీ ఈ గుడిలో నాలుగు సార్లు గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారని, ఈ విషయమై పలుమార్లు ఎ.కొండూరు పోలీసులకు తెలియపరచినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేయాలని, గుడికి రక్షణ కల్పించాలని కోరినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ పుటేజ్ ఆధారంగా చోరీ జరుగుతున్నట్లు తెలుసుకున్నామన్నారు. పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న వేలిముద్ర నిపుణులు ఆలయంలో వేలిముద్రలను సేకరించారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు గుడికి రక్షణగా రాత్రిపూట గస్తీ ఏర్పాటుచేసి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని గుడి ఛైర్మన్ జమలయ్య కోరారు.

కంచికచర్లలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కంచికచర్ల : రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కిందని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆరోపించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం భాగంగా కంచికచర్ల పట్టణ పరిధిలో గల ఇందిరా కాలనీలో మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తంగిరాల సౌమ్య టిడిపి నాయకులు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 6 ప్యాక్ మేనిఫెస్టో గురించి కరపత్రాలను అందజేశారు.

దిగుబడి ఉన్నా ధర లేదు



ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జురు మండల కేంద్రంలో మిర్చి సాగు చేసిన రైతులకు ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా పరిస్థితి ఎదురైంది. గ్రామాల్లో రైతులు సొంత భూమితో పాటు చిన్నసన్నకార రైతులు వివిధ రకాల పంటలను కౌలుకు తీసుకుని సాగుచేశారు. ముఖ్యంగా గత సంవత్సరం మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ సంవత్సరం ఎక్కువ మంది రైతులు భూమిని కౌలుకు తీసుకొని మిర్చి పంటను సాగు చేశారు. బొబ్బర్ల తెగులు వైరస్ తట్టుకొని గతం కంటే మిర్చి కొంతవరకు దిగుబడి వచ్చింది. వారి సంతోషం మిర్చి ధరలు భారీగా పడిపోవడంతో నీరుగారిపోయింది. రైతులు సాగు చేసి పంట చేతికొచ్చేసరికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుతం ధరలు రూ.5వేలు ధర తక్కువగా ఉంది. ఎగమతులు బాగా తగ్గడంతో మిర్చి ధరలు కూడా ధరలు తగ్గాయని వ్యాపారస్తులు చెప్తున్నారు. కొంతమంది రైతులు పంట సాగు అవసరాల కోసం గ్రామాల్లోనే మిర్చి కల్లాల్లోనే పంటను అమ్మేసుకుంటున్నారు. గత ఏడాది మిర్చి ధర క్వింటాలుకు రూ.27 వేల నుండి 30 వేల వరకు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం జనవరి ప్రారంభం తర్వాత మేలు రకాలు తేజ బాడిగ రకాలు కనిష్టంగా రూ.9 వేలుండగా గరిష్టంగా రూ.23వేలు ధర పలికాయి. 333. నెంబర్ 5.273.341 ఇతర రకాల ధరలు కనిష్టంగా 9,500 పలకగా గరిష్టంగా రూ.21వేలు మాత్రమే రైతుల వద్దనుండి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ జగ్గయ్యపేట, వత్సవాయి, చందర్లపాడు, వీరులపాడు, గంపలగూడెం, తిరువూరు మండలాల్లోని రైతులు ఈ ప్రాంతంలో సాగుచేసిన మిర్చి పంటను అమ్ముకోవాలంటే గుంటూరులోనే మిర్చి యార్డ్‌కు సొంత ఖర్చులతో తీసుకెళ్లాలి. చిన్న సన్నకారు రైతులు గుంటూరు తీసుకెళ్లి మిర్చిని అమ్ముకోవడానికి పెద్దగా ఆసక్తి చూపరు. ఎందుకంటే యార్డులో మోసాలు జరుగుతుం డటమే దీనికి కారణం. గుంటూరు మిర్చి యార్డులో రైతులు పెద్ద మొత్తంలో మిర్చిని తరలిస్తే తక్కువ ధరలు, తక్కువ మొత్తంలో మిర్చి తరలిస్తే ఎక్కువ ధర చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించుకుని మిర్చి రైతులను ఆదుకోవాలని న్యాయం చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

గతేడాది వచ్చిన ఆదాయం రాదు : చెక్కరామారావు, రైతు, నరసరావుపాలెం

ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశా. కౌలు ఎకరానికి రూ.30వేలు మిర్చి సాగు రూ.50 వేల నుండి రూ.75 వేల వరకు వ్యవసాయ పెట్టుబడులు పెట్టా. గత సంవత్సరం మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నా ప్రస్తుతం ధరలు గత సంవత్సరం కంటే రూ.7 వేల నుండి 10వేల వరకు ధరలు తక్కువ కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత తేమ పేరుతో వ్యాపారస్తులు రైతుల ఇంటికొచ్చి కొనుగోలు చేస్తున్నప్పటికీ గత సంవత్సరం వచ్చిన ఆదాయం రాదు.

అవగాహన కల్పిస్తున్నాం : నీలిమ, ఉద్యానవన అధికారి

గత సంవత్సరం కంటే ప్రకృతి వైపరీత్యాలు తట్టుకొని వైరస్ బారిన పడకుండా ఉండేందుకు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సదస్సులు నిర్వహించి కాపు మీద, పంటల దిగుబడి, అమ్మకాలకు తరలింపు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు కోరుతూ దీక్ష

ప్రజాశక్తి - తిరువూరు : ఎపి భూమి యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరువూరు కోర్టు ఎదుట న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. దీక్షలో మోదుగమూడి శ్రీనివాసరావు, మర్రకట్ల కుమార్, షేక్ సుభాని, సతీష్, దుర్గాప్రసాద్ కూర్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకురాత్రి జనార్ధన్ రావు ఏపీ భూమి హక్కుల యజమానం చట్టం వల్ల ప్రజల ఆస్తులకు జరిగే నష్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

ప్రధాన రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి కామ్రేడ్ నండూరి ప్రసాదరావు భవన్‌లో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సభకు జెవివి.జిల్లా అధ్యక్షులు వి.మురళీమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడారు. మతసామరస్యం లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో బిజెపి మత రాజకీయాలతో దేశాన్ని విద్వేషపూరిత పరిస్థితుల్ని తీసుకొచ్చిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో పాలక ప్రభుత్వాలు విఫలం అయ్యాయని, కార్మికుల హక్కులు కాలరాస్తున్నారు. కొండపల్లి మాజీ సర్పంచ్ వెనిగళ్ళ అమ్మాజీ, సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్, ఐద్వా నాయకులు బేబీ సరోజినీ, పార్వతీ, నవీన సిఐటియు యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు వాసవి యువసేన, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కంచికచర్లలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్ద బజారులో గల మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **సింగ్ నగర్ :** 60వ డివిజన్ వాంబే కాలనీలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. సందర్భంగా ఆర్యవైశ్య సంఘం డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కృష్ణ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.బాబురావు మాట్లాడారు. డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ ఉపాధ్యక్షులు ఎస్ కే పీరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు న్యా శెట్టి మహేష్ డివిజన్ డివైఎఫ్ఐ కార్యదర్శి పి రవికుమార్ సత్తు శ్రీనివాసరావు ఎస్ అప్పన్న ఓంకార్ తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొర్రా కిరణ్ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొర్రా కిరణ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన బాటలోనే మనమందరం నడుద్దామన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర కు మద్దతు ఇద్దామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పంచాయతీ మాజీ మెంబర్లు డిసిసి ప్రధానకార్యదర్శి అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు, రాగాల రాము, పోతురాజు థామస్ పాల, వై.కోటేశ్వరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని 5వ వార్డ్‌లో నూతనంగా మూడున్నర లక్షల రూపాయలతో నిర్మించబోతున్న రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనలో ఛైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ గౌతమి స్కూల్ పరిసర ప్రాంతాలైన ఈ ప్రదేశంలో రోడ్డు సరిగా లేక చాలా సంవత్సరాల నుంచి ప్రజలు, పాఠశాల పిల్లలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్ కౌన్సిల్ దష్టికి ఈ సమస్యను తీసుకురాగా ఈ రోడ్డు పనులు ప్రారంభించామని, 30, 31 వార్డులను కలగలుపుతూ సుమారు 35 లక్షల రూపాయలతో రోడ్డు పనులు పూర్తయ్యారని అన్నారు. త్వరలోనే ప్రారంభమవుతుందని, తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పందుల రోశయ్య, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం ఎస్‌జిఎస్ కాలేజి ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంవిఐయం.రవి కుమార్ భద్రత నియమ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం కొనసాగించాలని విద్యాసంస్థల యాజమాన్యానికి, బస్సు డ్రైవర్లకు, సహాయకులకు, సూపర్‌వైజర్లు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యు.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఎండి టి.ఆలం, జి.విజయ భాస్కర్ పాల్గొన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు అవగాహన

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా వీధి వ్యాపారస్తులు తోపుడుబండ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు నందిగామ రూరల్ సిఐ పి.చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. మాట్లాడుతూ జాతీయ రహదారిపై తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వ్యాపారస్తులు సహకరించి తమ వ్యాపారానికి ఉపయోగించే తోపుడుబళ్లను రహదారిపై కాకుండా వేరొక ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా తోపుడుబండ్లు జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియా ఉడ్ ఫర్నిచర్ ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉడ్ వర్కింగ్, ఫర్నిచర్ ప్రొడక్షన్ టెక్నాలజీపై 'ఇండియాఉడ్ 2024' పేరుతో ఫిబ్రవరి 22 నుండి గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఎస్.కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ఫిబ్రవరి 22 నుండి 26వ తేదీ వరకు బెంగుళూరులో ఈ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో 950కిపైగా కంపెనీలు, 50కి పైగా దేశాల నుండి వాణిజ్య సందర్శకులు పాల్గొంటారని తెలిపారు. సాంకేతికత, సరఫరాదారులు, కొనుగోలు దారులను ఒకచోటకు చేర్చుతుందన్నారు. ఇందులో సెమినార్లు, వర్క్‌షాపులు, ప్యానెల్ చర్చల సమగ్రమైన లైనప్ ఉంటుందన్నారు. అత్యాధునిక మెషినరీ టెక్నాలజీ, మెటీరియల్స్, సామాగ్రి, ఫిట్టింగ్‌లు, హార్డ్‌వేర్, కాంపోనెంట్‌ల ఉంటాయని ప్రదానంగా చర్చలు హైలెట్ కానున్నాయని తెలిపారు.

సరైన ప్రణాళికతోనే పోటీ పరీక్షల్లో విజయం

ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ: పోటీ పరీక్షలకు తయారయ్యే అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా అధ్యయనం చేయడం ద్వారా విజయం సాధించవచ్చునని ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు సూచించారు. మంగళవారం యుటిఎఫ్ అవనిగడ్డ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రగతి విద్యాసంస్థల ప్రాంగణంలో డివైఈవో పరీక్షలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సనక పూర్ణచంద్రరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు పాల్గొని విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆరు వేల పోస్టులు భర్తీ చేసేందుకే సంసిద్ధమవుతుందన్నారు. రెండు సంవత్సరాలుగా ఉద్యోగ విరమణ లేకపోవడంతో


మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

గత ఆరు నెలలుగా ఉద్యోగ విరమణ చేసిన వారు ఆరు వేల మంది ఉండగా తక్షణమే 14 వేల పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉందన్నారు కాగా గ్రూప్ టు 897 పోస్టులు పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ సిద్ధపడుతుందని ఇంకా వంద పోస్టుల వరకు పెంచే అవకాశం ఉందన్నారు అదేవిధంగా డిగ్రీ లెక్చరర్ పోస్టులు 240 వరకు ఉన్నాయని అవకాశం ఉందన్నారు. వీటికి సంబంధించి ప్రాథమిక పరీక్షలు ఫిబ్రవరి మార్చిలో జరిగే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలని, సిలబస్‌పై పట్టు సాధించాలని, పాత ప్రశ్నాపత్రాలను పరిశీలించాలని ప్రామాణిక పుస్తకాలను అధ్యయనం చేయడంతో పాటు సొంతగా నోట్స్ తయారు చేసుకోవాలని తద్వారా విజేతలు అయ్యేందుకు ఎక్కువ అవకాశం కలుగుతుందని లక్ష్మణరావు సూచించారు. ఈ సందర్భంగా గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఆంధ్రుల చరిత్ర ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ ఆంధ్రుల సామాజిక ఆర్థిక చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు జివేంద్రరావు, ఎన్ శ్రీకాంత్, విశ్రాంతి ఉపాధ్యాయులు కూనపరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధన రాజకీయాలు సరికాదు : బుద్ధప్రసాద్

ప్రజాశకి-అవనిగడ్డ: జనం కోసం కాక ధనం కోసం మాత్రమే రాజకీయ పక్షాలు ఆలోచించడం సరికాదని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీ 76వ వర్ధంతి పురస్కరించుకొని గాంధీ క్షేత్రంలో దివిసీమ లలిత కళా సమితి గ్రామీణ యువజన వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నీతి నియమాలు లేని రాజకీయాలు మహా పాపమని మహాత్మా గాంధీ చెప్పిన మాటని పెడచెవిన పెట్టడం వల్ల దేశ రాజకీయాలకు అరిష్టం చుట్టుకుందని తెలిపారు. సామాన్యుడు ఎన్నికల్లో నిలబడే పరిస్థితి లేకుండా పోయిందని డబ్బుంటే చాలు ఎన్ని జబ్బులు ఉన్నా పరవాలేదు అనే స్థితికి సమాజం దిగజారి పోయిందన్నారు. చిత్రలేఖనం వ్యాసరచన పోటీల్లో 200 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, మాజీ జడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనప రెడ్డి చంద్రశేఖర్, గుడిసేవ విష్ణు ప్రసాద్, గుంటూరు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల నిర్మాణానికి అదనపు నిధులు

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో గ్రంథాలయల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సమావేశ హాలులో గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ అధ్యక్షతన 2023-24 ఆర్థిక సంవత్సరపు సవరణ బడ్జెట్ 2024-2025 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈ సమావేశం లో 2023-24ఆర్థిక సంకు శాఖా గ్రంథాలయ భవనాల నిర్మాణం కొరకు ఆదనంగా కోటి రూపాయలు కేటాయించడానికి ఆమోదం తెలపడం జరిగిందన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయాలలో పనిచేస్తున్న స్వీపర్స్ కు వేతనాలు పెంచడానికి డైరక్టర్ కు సిఫారసు చేస్తూ తీర్మానించడమైనదన్నారు. సైటేషన్ లిస్టు వచ్చిన తదుపరి తొంబై లక్షల రూపాయలతో కొత్త పుస్తకాలు కొనుగోలు నిమిత్తం తీర్మానం చెయ్యడం జరిగిందన్నారు. అదేవిధంగా 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు శాఖా గ్రంథాలయ భవనాల నిర్మాణం నిమిత్తం 3కోట్లు, కంప్యూటర్స్ కొనుగోలు నిమిత్తం 2కోట్లు, పుస్తకాల కొనుగోలు నిమిత్తం ఒక కోటి రూపాయలు, 16లక్షల రూపాయలు ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు నిమిత్తం తీర్మానాలు ఆమోదించడం జరిగిందన్నారు. వీటితోపాటు మరో 15 తీర్మానాలు ఆమోదించడం జరిగిందన్నారు. ఈ సమావేశం లో కష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటి సభ్యులు ,జిల్లా పంచాయితి అధికారి ఎస్ వి.నాగేశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-మోపిదేవి మండల పరిధిలోని కృష్ణానది లంక భూముల్లో మామిడి తోటలు ప్రస్తుతం పూత పిందె దశలో ఉన్నందున మామిడి రైతులు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవనిగడ్డ ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్ మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. మేళ్లమర్తి లంక గ్రామంలో తోటల పరిశీలించి పూత నిలబడడానికి ఫ్లోనోఫిల్ పది లీటర్ల నీటికి నాలుగు మిల్లీ కలిపి పిచికారి చేసుకోవాన్నారు. తేనే మంచు పురుగు నివారణకు ఇమిడా క్లోబ్రిడ్ ఒక లీటర్ నీటికి మూడు మిల్లీ చొప్పున, పొటాషియం నైట్రేట్ ఒక లీటర్ నీటికి ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. తెగులు నివారణకు మాన్కోజబ్ ఒక లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు మేలైన రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడుల సాధించుకోవచ్చున్నారు.

నిధులు కోరుతూ సర్పంచుల నిరసన దీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రజలచే ఎన్నికైన సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మహాత్మ గాంధీ వర్థంతి సందర్భంగా సర్పంచులు తమ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ ల సంఘం,ఆం.ప్ర. పంచాయతీరాజ్ ఛాంబర్, ఆధ్వర్యంలో మంగళవారం కష్ణా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద సర్పంచులు ఒక రోజు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ నిరసన దీక్షకు మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర సంఘీభావం తెలిపి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను బ్రస్టు పట్టించడాని విమర్శించారు. దేశానికి గ్రామాలే పట్టు కొమ్మలు అన్న గాంధీజీ , జగన్ మోహన్ రెడ్డి ఆ పట్టు కొమ్మలనే నరికేశాడ న్నారు.స్థానిక సంస్థల నిధులన్నీ దారి మళ్లించి గ్రామాల అభివద్ధిని కుంటు పరిచడన్నారు.మూడు సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ లు శాంతియుతంగా తమ ఆందోళనలు చేస్తున్న ముఖ్య మంత్రి కనీసం నోరు విప్పకుండా వారిని అవమానపరుస్తున్నడన్నారు.తమ హక్కుల కోసం సర్పంచ్ లు చేస్తున్న పోరాటాలకు తెలుగుదేశం పార్టీ



సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.జన సేన మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డం.రాజు మాట్లాడుతూ గ్రామాల అభివద్ధికి సహకరించ పొగ వారి నిధులను కూడా దారి మళ్లించిన జగన్ మోహన్ రెడ్డి లాంటి ముఖ్య మంత్రి దేశంలో ఎక్కడా ఉండ బోడన్నారు.ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం కార్యదర్శి కాగిత గోపాల్ రావు,మరియు కార్యనిర్వాహణ కార్యదర్శి గల్లా తిమోతిలు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చాంబర్ మరియు సర్పంచుల సంఘం అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్, వానపల్లి లక్ష్మీ ముత్యాలరావుల పిలుపు మేరకు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనే లక్ష్యంగా 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243జి 11వ షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలలోని నిధులు, విధులు ,అధికారాలను స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ లకులి బదలాయించి గ్రామపంచాయతీ, మండల పరిషత్తులు ,జిల్లా పరిషత్తులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పంచాయతీల నిధులు దారి మళ్లించిన 10 వేల కోట్ల రూపాయలు వెంటనే గ్రామ పంచాయతీలకు జన చేయాలని లేదంటే రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



చంద్రశేఖరరావుకు నివాళి

ప్రజాశక్తి-ఘంటసాల: గొర్రెపాటి విద్యా ట్రస్ట్ నిర్వాహకులు గొర్రెపాటి చంద్రశేఖరరావుకు మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య నివాళు లర్పించారు. సోమవారం గొర్రెపాటి చంద్రశేఖరరావు మృతిచెందగా ఆయన మరణవార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య చంద్రం స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను, కుమారులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. రైతు నాయకుడిగా గొర్రెపాటి చంద్రశేఖరరావు ఎనలేని సేవలందించారని ఈ సందర్భంగా కొనియాడారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు: సమాజంలో ఇన్నర్వలీక్లబ్ సేవలు ప్రశంశనీయమని మాజీ ఎమ్మెల్యే అన్నే విజయ లక్ష్మి అన్నారు. ఇన్నర్వేలీక్లబ్ జిల్లా అధ్యక్షురాలు అధికార పర్యటనలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉయ్యూరు, పరిసర ప్రాంతాల్లో క్లబ్ చేస్తున్న సేవాకార్యక్రమా లు



అభినందనీయమన్నారు. స్నేహం. సేవ ఇన్నర్వోలీక్లబ్ లక్ష్యంగా పని చేస్తుందని క్లబ్ సెంటినరీ కార్యక్రమాల్లో భాగంగా ప్రస్తుత సంవత్సరంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు జిల్లా అధ్యక్షురాలు గందం శ్రీదేవి తెలిపారు. సంవత్సరం కాలంలో చే సిన సేవాకార్యక్రమాలను క్లబ్ అధ్యక్షురాలు నర్రాసుధారాణి, కార్యదర్శి అన్నేరాణి తెలి పారు. ఐఎస్ఓ ఉషారాణి పలువురు సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పేదలకు దుప్పుట్లు పంపిణీ చేశారు.

కోడింగ్ స్కిల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఇ.సి.2 ,3 వ సంవత్సరం 2 వ సెమీస్టర్ చదువుతున్న విద్యార్థులకు కోడింగ్ స్కిల్స్ నైపుణ్యం పెంపొందే విధంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ స్టూడెంట్ ఛాంబర్ వారు మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా. బి కరుణకుమార్ స్వాగతోపన్యాసంలో మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న సాంకేతిక రంగంలో మార్పులతో పాటు విద్యార్థి కూడా వేగంగా నేర్చుకుంటూ వారి స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. అలాగే కోడింగ్ స్కిల్స్ పై పట్టు సాధించి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమము రెండు ధఫాలుగా నాలుగు సెక్షన్ల విద్యార్థులకు జరుగుతాయన్నారు. ఇ.సి.ఇ విభాగాధిపతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం జరగటానికి అనుమతించిన విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు దోహదపడిన కాలేజీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్వైజరీ టు ది మేనేజేమెంట్ డా పి రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎడ్మినిస్ట్రేషన్ డా పి.కోదండరామారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎకడమిక్స్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: ప్రభుత్వంతో పాటు దాతలందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రవాస భారతీయుడు వల్లంకొండ రఘు (ఐర్లాండ్) అన్నారు. బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి అభివృద్ధికి మంగళవారం రూ.20 వేలు విరాళంగా ఇచ్చారు. ఆ నగదును ఆస్పత్రి ఆవరణలో వైద్యాధికారి డాక్టర్ కె.వాహినికి ఆయన అందజేశారు. కేరళ పంచకర్మ వైద్యం అందించేందుకు ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు, పక్షపాతం వచ్చిన రోగులకు పూర్తి ఉచితంగా కేరళ పంచకర్మ వైద్యం అందించనున్నట్లు డాక్టర్ వాహిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్తి రాంబాబు, ఆలపాటి రమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండపల్లి హరిబాబు, వడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం దేవుని చెరువుస్టేడియం వెనకాల రోడ్డులో గత 15 రోజులుగా తాగునీరు రాకపోవడంతో స్థానికులు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రోజుల తరబడి నీరు రాకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకున్న వారే లేరని, ఓట్లు కావలసినప్పుడు వస్తున్నారే తప్ప తర్వాత మా వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజల అవసరాలు తీర్చడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. మంచినీళ్ల కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాటర్ ప్లాంట్‌కి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. కూలి పనులకు వెళ్లాలంటే సకాలంలో వెళ్లలేకపోతున్నామని రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు మావని ఇకనైనా అధికారులు పాలకులు స్పందించి సకాలంలో తాగునీరు అందించాలని మహిళలు కోరుతున్నారు. స్థానిక మహిళలు తిరుపతమ్మ, సరస్వతి, ప్రియాంక, జ్యోతి, నక్షత్రమ్మ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనానికి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనం తరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.



సత్యనారాయణకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఇఒ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న అవధాని మాడుగుల నాగఫణి శర్మ

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ప్రముఖ ద్విసహస్ర (సంస్కృతం, తెలుగు) అవధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ మంగళవారం శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేయగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కెఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఛైర్మన్, కార్యనిర్వాహణాధికారి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం,, చిత్రపటం అందజేశారు.

నియామకం

ప్రజాశక్తి - భవానీపురం : ఆంధ్రప్రదేశ్ ఎస్‌టి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు మద్దిల రామకృష్ణను మరోసారి కొనసాగిస్తూ సిఎం జగన్ ఉత్తర్వులు జారీచేయటం పట్ల రామకృష్ణ సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారుల నుండి నియామక పత్రాన్ని మద్దిల రామకృష్ణ మంగళవారం అందుకున్నట్లు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న మద్దిల రామకృష్ణ

సెర్ప్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - భవానీపురం : ఎనిమిది రోజులుగా గొల్లపూడి డిఆర్‌డిఎ ఆఫీసు వద్ద నిరవధిక దీక్షలు చేస్తున్న సెర్ప్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్‌తో కలిసి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులు గడిచిన 23 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో భాగంగా వైసిపి ఆసరా, వైఎస్ఆర్ చేయూత, నాడు - నేడు, సున్నా వడ్డీ, జగనన్నతోడు, జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణం పేదలకు సుస్థిర జీవనోపాదులు పెంపుదల వంటి సంక్షేమ పథకాలు అమల్లో కీలక పాత్ర పోషిస్తున్న సెర్ప్ ఉద్యోగులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయటం తగదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయటం ద్వారా పే స్కేల్స్ పెంచాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఇపిఎఫ్ సీలింగ్ విధానం తీసివేసి మూలవేతనంపై వంద శాతం ఇపిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెర్ప్‌లో కారుణ్య నియామకాలు జరిపి మరణించిన కుటుంబాలక న్యాయం చేయాలన్నారు. సెర్ప్ సిబ్బంది పదవీ విరమణ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న గ్రాట్యూటీ రూ. 16 లక్షలు, హెచ్ఆర్‌పి జిఒను సెర్ప్ ఉద్యోగులకు అమలు చేయాలన్నారు.



సెర్ప్ ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, కోట కళ్యాణ్

ప్రజాభివృద్ధే అజెండా



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చాం కాబట్టే ప్రజల ముందుకు మరోసారి వస్తున్నామని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొ న్నారు. మండలంలోని జయంతిపురం గ్రామంలో 50 లక్షల ఎస్టీ నిధులతో సిసి రోడ్లు, డ్రైన్లు ప్రారంభం, 100మంది లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పట్టాలను ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అందజేశారు. తిరుమలగిరి గ్రామంలో 1.61 కోట్లతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం ఆర్.బి.కే కేంద్రం, తిరుమలగిరి నుండి చిల్లకల్లు వరకు రోడ్డు తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయిలేదు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వైసీపీ కోవర్ట్ అంటూ పలుమార్లు నిరూపితం అయ్యిందని, చంద్ర బాబును విమర్శించే స్థాయి నానికి లేదని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మండిపడ్డారు. మంగళవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ టీడీపీలో ఏ నాయకుడితో కూడా నాని కలిసి పనిచేసింది లేదన్నారు. వైసీపీ నాయకులతో మాత్రం నాని చాలా దగ్గరగా కలిసి నడిచాడని, ఎప్పటి నుంచో ఈ కోవర్టు రాజకీయాలకు నాని తెర లేపాడని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల వ్యతిరేకి కేశినేని నాని అంటూ దుయ్యబట్టారు. సమావేశంలో టిడిపి నాయకులు సారదబోయిన ఏడుకొండలు, రాజు సోలంకి, కామా దేవరాజు, హనుమంతరావు పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీ మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : పోలంపల్లి గ్రామానికి చెందిన మాదుగుల మనోహర్ (30) వేమవరం సచివాలయ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. మనోహర్ కొంత కాలంగా అనారోగ్యం ఉండటంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. 8 నెలల క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని సొంతగ్రామమైన పోలంపల్లి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట వైసిపి నాయకులు సామినేని వసంత కృష్ణ ప్రసాద్, వైసిపి సీనియర్ నాయకులు పోలంపల్లి సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవికుమార్, జడ్పిటిసి ఏసు పోగు దేవమని శ్రీనివాసరావు, పోచవరం సర్పంచి లేళ్ల హరికృష్ణ రెడ్డి, కుక్కల సురేష్ కుమార్ ఎమ్మార్పీఎస్ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కనీస వసతులు లేని చేపల మార్కెట్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : హనుమంతరాయ చేపల మార్కెట్ సముదాయం సమస్యల వలయంలో ఉందని, బాత్రూములు కూడా లేక మహిళా చిరు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన మహేష్ విమర్శించారు. మంగళవారం 53వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షులు పొట్నూరి శ్రీనివాసరావు, డివిజన్ కమిటీసభ్యుల ఆధ్వర్యంలో హనుమంతరావు చేప మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మార్కెట్ భవన సముదాయం చిన్నపాటి వర్షానికి కూడా స్లాబుల్లోంచి నీరుకారి డ్రై ఫిష్ అంత కూడా తడిసిపోయి లక్షల్లో నష్టం వస్తుందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారన్నారు. రాబోయేది జనసేన- టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలేటి మోహన్‌రావు, విటల్, ప్రసన్న, రేఖపల్లి శ్రీను, యుగంధర్, నాగూర్ ఖాన్, కొరగంజి వెంకటరమణ పాల్గొన్నారు.

జర్నలిస్టుకు పరామర్శ



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నిమ్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వార్తా ప్రభ రిపోర్టర్, ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హఫీజ్‌ను జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు, వారాహి మీడియా కో - ఆర్డినేటర్, సెంట్రల్ ఆంధ్రా జోన్ కో - కన్వీనర్ బొలిశెట్టి శ్రీకాంత్ మంగళవారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పరిధిలోని 11 కెవి భవానీపురం ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా ఈ నెల 31వ తేదీ బుధవారం ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు (2గంటలు) పాటు భవానీపురం పరిధిలోని యం.ఐ.జి-1 బ్లాకులు, స్వాతి థియేటర్ రోడ్, మానవమందిర్ రోడ్, అమత అపార్ట్మెంట్ రోడ్, పోపూరివారి వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్, లత హాస్పిటల్ రోడ్, ఎం.పి.దాస్ వీధి, ఆకులరాజేశ్వరరావు మిల్ రోడ్, చెట్ల బజార్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివోతుంది. పున్నమి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కె.వి. శంకర మఠం విద్యుత్తు లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 31వ తేదీ బుధవారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు జొన్నవిత్తుల వారి వీధి, శంకర మఠం, పార్థసారథి వీధి, గురు కృప రోడ్, టి.వి.కృష్ణారావు వీధి, గుప్తా సెంటర్ డౌన్, షాదీ ఖానా ఏరియా, అండమాను బ్రహ్మయ్య వీధి, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, బుద్దా వారి వీధి, కె.సి.స్కూల్ రోడ్, సిమెంట్ రోడ్డు తదితర ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.



డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

జెవివి డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞానవేదిక(జెవివి) డైరీని జెవివి జిల్లా గౌరవాధ్య క్షుడు డాక్టర్ వి.రవీంద్ర మంగళవారం తిరువూరు జ్యోతి నర్సింగ్ హోంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్ర మంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, ఉపాధ్య క్షుడు ఎం.హరికృష్ణ, ప్రతినిధులు రాం ప్రదీప్, సుదర్శన్, సుధాకర్, సుభానీ, లీలా ప్రసన్న, వీరారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి హాస్య నాటిక పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సుమధుర కళా నికేతన్ 50 వార్షికోత్సవంలో భాగంగా 26వ తెలుగు హాస్య నాటిక పోటీలు మొగల్రాజపురం లోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఫిబ్రవరి 1 నుండి నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎం.సి.దాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో గుడివాడకు చెందిన శ్రీకృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి 'నా నాన్న నేనే గెలిచా', నగరానికి చెందిన హర్ష క్రియేషన్స్ -ట్రీట్మెంట్ నాటికలు ఉంటాయని అన్నారు. రెండో రోజు ఉదయం 10 గంటల నుంచి విశాఖపట్నం కు చెందిన మాతృశ్రీ కళానికేతన్ వారి 'చూపులు కలవని శుభవేళ', నగరానికి చెందిన యంగ్ థియేటర్స్ ఆర్గనైజేషన్ వారి' రంగుపడుద్ది, చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'ఏడున్నాడు ఎక్కడున్నాడు' నాటికలు జరుగుతాయని ఆయన చెప్పారు. మూడో రోజు నగరానికి చెందిన న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్స్ వారి 'కపిరాజు', కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ వారి పక్కింటి మొగుడు, హైదరాబాదుకు చెందిన యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్స్ వారి బూడిద నాటిక, విశాఖపట్నం భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ వారి కలిసి ఉంటే నాటిక ప్రదర్శించనున్నారు. చివరి రోజు శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల బందం వారి" ఇంకానా 'హైదరాబాద్‌కు చెందిన బి.స్టూడియో వారి 'న్యూ బాంబే టైలర్స్, నాటికలు ప్రదర్శించనున్నారని తెలిపారు.

ఎపి భవన్లో స్థానిక సమస్యలు చర్చించాలి : దేవినేని ఉమా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఢిల్లీ ఎపి భవన్‌లో స్థానిక సమస్యలపై చర్చించాలని పోలవరం, ప్రత్యేక హోదా, రైల్వేజోన్లపై మాట్లాడాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడని ప్రజా వ్యతిరేకతకు భయపడి చెట్లు కొట్టేసి పరదాలు కట్టుకొని సభలకు వెళ్తున్నాడని ఎద్దేవా చేశారు. కోర్టుల్లో చెంపపెట్టు లాంటి తీర్పులు వస్తున్నా ప్రభుత్వ వైఖరిలో మార్పు లేదని కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చుపెట్టి చంద్రబాబు బెయిల్ క్యాన్సిల్ చేయాలని తిరుగుతున్నారని అన్నారు. తెలుగుదేశం భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ ఇచ్చిన ఆరు హామీలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, ఎమ్మెల్యేలను ఎంపీలను మార్చినంత మాత్రాన ప్రజా వ్యతిరేకత నుంచి బయట పడలేరని సీట్లు ఇస్తామన్నా పోటీ చేయడానికి భయపడి పారి పోతున్నారని ఆయన పేర్కొన్నారు. వైసిపి పార్టీకి జగన్ రెడ్డికి ఇవే చివరి ఎన్నికలని వైసిపిని ప్రజలు 161 అడుగుల లోతులో పాతి పెడతారని జోస్యం చెప్పారు. రా కదలిరా సభలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వస్తున్నారని రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ఆయన తేల్చి చెప్పారు.



మాట్లాడుతున్న దేవినేని ఉమామహేశ్వరరావు

ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

వైసిపి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని, మోకాళ్ళపై నిలబడి ప్లకార్డులతో జిల్లా కోర్టులో న్యాయవాదుల సంఘం ఎదుట న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు మంగళవారం నిరసన తెలియజేశారుఈ సందర్భంగా మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, తుంగల హరిబాబు మాట్లాడుతూ అధికారం చేతిలో ఉందని ప్రజా వ్యతిరేక చట్టాలను చేసి దోచుకోవాలని చూసే పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయన్నారు.ప్రజలకు హాని చేసేలా తీసుకువచ్చిన నూతన భూ హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాల సంఘాల తరఫున విధులు బహిష్కరించి ఉద్యమం చేస్తున్న పాలకులకు కనపడకపోవడం సిగ్గుచేటన్నారు.అధికారం ఎవరికి శాశ్వతం కాదని పాలకులు గ్రహించాలన్నారు. సీనియర్ న్యాయవాది సోడిశెట్టి బాలాజీ రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు మూడు నెలలుగా వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజలకు హాని చేసే నూతన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వివిధ రూపాలలో నిరసనలు తెలియజేస్తున్న పాలకులకు చీమ కుట్టినట్లయినా లేకపోవడం సిగ్గుచేటన్నారు.ప్రజా ప్రతినిధులకు ఈ నూతన భూ హక్కు చట్టంపై వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదంటే ఎంత అహంకారంతో పరిపాలన సాగిస్తున్నారో ప్రజలు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, కొట్టే రఘురాం, న్యాయవాదులు, గుండు ప్రకాష్, జీవీఎల్ నరసింహారావు, పరస మధుసూదన రావు, ఎండి రిజ్వానుల్లా, ఎంఎస్ స్వామి, సుబ్రహ్మణ్యం, న్యాయవాద గుమస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పూలతో న్యాయవాదుల నిరసన

గన్నవరంలో మంచినీటికి ఇక్కట్లు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం పంచాయతీ పరిధిలో సొసైటీ పేట, ముస్లిం పేట, గాజులపేట ప్రాంతాల్లో గత వారం పది రోజులుగా తాగునీరు సరఫరా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు బయట మార్కెట్లో త్రాగునీరు కొనుక్కోలేక అగచాట్లకు గురవుతున్నారు. పంచాయతీ ఆఫీస్ కి వెళ్లి తమ సమస్య గురించి అధికారులు చెప్తే మోటార్ పాడైపోయిందని చెప్తున్నారు.కానీ సమస్యకు పరిష్కారం చూపట్లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి-కోడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా లింగారెడ్డి పాలెం గ్రామంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించి పూరిల్లు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయురాలుగా మిగిలిన కొండూరి నాంచారమ్మకు ఇండియన్ రెడ్ క్రాస్ కోడూరు మండల శాఖ వారు చేయూత అందించారు. మంగళవారం కోడూరు మండల రెడ్ క్రాస్ శాఖ సభ్యులు నాంచారమ్మను పరామర్శించి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు అందించిన వంట సామాగ్రి, బడే కష్ణ (సైకిల్ షాప్)వారు అందించిన 25 కేజీల బియ్యం, కోడూరు ఏ ఎస్ ఐ వీరాంజనేయులు అందించిన నిత్యవసర సరుకులు నాంచారమ్మకు అందజేశారు. వారితోపాటు అవనిగడ్డకు చెందిన పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ రూ.11 వేలు ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాస్ సోదరుడు రాంబాబు ఈ సాయాన్ని బాధిత కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల శాఖ చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు, శాఖా సభ్యులు రేపల్లె యోగ ప్రకాష్, గోనా వేణుగోపాలరావు, తెలుగుదేశం జనసేన నేతలు మర్రే గంగయ్య, బడే వీరబాబు, కాగిత రామారావు యర్రంశెట్టి దుర్గ, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



'ముస్లిముల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం'

ప్రజాశక్తి-కోడూరు: ముస్లింల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని మాజీ జెడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం కోడూరు మండలం చిన్న గుడు మోటు గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ నజీర్ భాష, మహమ్మద్ లతీఫ్, మహమ్మద్ యూసుఫ్, కడవకొల్లు నాంచారయ్య ,మహమ్మద్ ఇమ్రాన్ ,అబ్దుల్ ఖలీల్, పిల్లి మల్లికార్జునరావు, గోగినేని సోమశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయములో మంగళవారం జలజీవన్ మిషన్‌పై శిక్షణా తరగతి, జీపిడిపి సమావేశం నిర్వహించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఎస్‌హెచ్‌జి గ్రూపులతో కలసి గ్రామాలలో ప్రజలకు పైప్‌లైన్ విస్తరణ ద్వారా ప్రతి ఇంటికి నీటి కుళాయి ఏర్పాటు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమమునకు ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీఓ దారపు శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శివాజీ, ఈవోపీఆర్డి దిలీప్ కుమార్, అబ్బా దాసరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి మండలంలోని వివిధ డిపార్ట్మెంట్‌లలో పనిచేస్తూ..రిపబ్లిక్ ఉత్సవాల్లో కలెక్టర్ నుండి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులను మహాత్మ జ్యోతిరావు పూలే అభిమాన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఘనంగా సన్మానించారు. చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.నాగప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నల్లూరి వెంకట భార్గవ ,పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేర్ని మాధవేంద్రరావు , చల్లపల్లి పోలీస్ స్టేషన్ రైటర్ మొక్కలగడ్డ పవన్‌కుమార్, చల్లపల్లి పంచాయితీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సంధ్య, ఆఫీస్ సబార్డినేట్ రామలక్ష్మిలకు మహాత్మా జ్యోతిరావు పూలే అభిమాన సంఘ సభ్యులు అడ్డాడ ప్రసాద్, కైతేపల్లి దాస్, ఉప్పల సాంబశివరావుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దాసి సీతారామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎస్‌పి హరిరాజేంద్రప్రసాద్, చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, వక్కలగడ్డ పిఎసిఎస్ అధ్యక్షుడు హనుమాన్ల సురేంద్రనాద్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



నేడు కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పల్లెల్లో నిజమైన క్రీడా ప్రతిభ వెలుగు లోకి రావాలనే లక్ష్యం తో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ప్రకటించిన ఆడుదాం ఆంధ్రా క్రీడల జిల్లా స్థాయి కబడ్డీ



పోటీలను గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా పోటీల సమన్వయ కర్త ధనియాల నాగరాజు పత్రికలకు తెలిపారు. శాసన సభ్యులు వంశీ మోహన్ సారధ్యంలో ఎంపిపి అనగాని రవి ఆధ్వర్యంలో జిల్లా క్రీడల అభివద్ధి అధికారిణి కే ఝాన్సీ లక్ష్మి, ఎంపిడిఒ సత్య కుమార్ పర్యవేక్షణ లో జరుగుతున్న ఈ పోటీలకు ఏడు నియోజకవర్గాల నుండి క్రీడాకారులు హాజరువుతున్నట్లు నాగరాజు తెలిపారు. ఉదయం ప్రారంభమైన పోటీలు రాత్రి విధ్యుత్ దీపాల వెలుగులో కన్నుల పండుగగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హాజరైవుతున్న క్రీడాకారులకు అనగాని రవి సొంత నిధులతో భోజనం ఏర్పాట్లు చేసినట్లు అలాగే ప్రతి జట్టు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక గదులు సమకూర్చినట్లు ధనియాల వివరించారు.

వైసిపి మాటలను నమ్మొద్దు : కొల్లు

ప్రజాశక్తి-చల్లపల్లి: వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర అన్నారు. చల్లపల్లి మండల జయహో బీసీ సదస్సు సోమవారం రాత్రి స్థానిక ఏటీఎం సెంటరులో జరిగింది. రవీంద్ర మాట్లాడుతూ ప్రజల్లో నమ్మకం కోల్పోయిన జగన్ ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ఎత్తుగడలు వేస్తుంటాడనీ, మాయమాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తారనీ, బీసీలు, ప్రజలు ఎవరూ మోసపోవద్దని సూచించారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ బీసీలు, ఎస్సీలపై వైసీపీ ప్రభుత్వంలో జరిగినన్ని అత్యాచారాలు, హత్యలు మరే ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. అన్ని వ్యవస్థలనూ సర్వనాశనం చేసిన ముఖ్యమంత్రిని సాగనంపాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో టీడీపీ రాష్ట్ర నేతలు కొనకళ్ల బుల్లయ్య, బచ్చుల సుబ్రహ్మణ్యం, బొడ్డు వేణుగోపాలరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, నేతలు పైడిపాముల కృష్ణకుమారి, మోర్ల ప్రసాద్, లుక్కా పిచ్చియ్య, ఎ.పాండురంగారావు, ఉస్మాన్ షరీఫ్, మోర్ల జయలక్ష్మి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించి రోడ్లపై ప్రయాణించాలని గుడివాడ డిఎస్‌పి పి.శ్రీకాంత్ తెలిపారు. 35వ జాతీయ రోడ్డు భద్రత ఉత్సవంలో భాగంగా గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుడివాడ డిఎస్పి పి. శ్రీకాంత్ విద్యార్థులన ఉద్దేశించి మాట్లాడుతూ "రహదారి భద్రత జీవితానికి రక్ష" అని వివరిస్తూ, వ్యక్తి నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలితీసుకుంటుంది అని నిజ జీవితంలో జరిగిన కొన్ని ఉదాహరణలను దశ్య మాధ్యమం ద్వారా చూపించడం జరిగింది అలాగే రోడ్డ పక్కన ఉండే గుర్తులను బట్టి ఎలా వాహనాలను నడపాలో, సురక్షితంగా గమ్యస్థానం చేరాలో సవివరంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ సిఐ కె.ఏసుబాబు, గుడ్లవల్లేరు ఎస్ఐ జి.సత్యనారాయణ , పాలిటెక్నిక్ అకడేమిక్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ జీవివి సత్యనారాయణ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని మచిలీపట్నం బ్రేక్ ఇన్స్పెక్టర్ సిద్ధిక్ తెలిపారు. మంగళవారం ఎస్సీఎల్ క్రాంతి కళాశాల ల ప్రాంగణంలో మాసోత్సవ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొందరు విద్యార్థులు లైసెన్స్ లేకున్నా ఉత్సాహంతో ద్విచక్ర వాహనాలను రహదారులపై ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకుండా అడ్డదిడ్డంగా నడుపుతారన్నారు.



అదేవిధంగా ట్రాఫిక్ నియమాలు వదిలేసి విపరీతమైన వేగంతో వాహనాలు నడపడం ద్వారా తరచూ రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ అనుసరిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎన్‌వి నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ లోకనాథ్ ప్రసాద్ పాల్గొన్నారు.

గాంధీకి నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: జాతిపిత మహాత్మా గాంధీ 76 వర్ధంతిని పురస్కరించుకుని కష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పట్టాభి భవనంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింత సంజీవరెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా మార్గంలో పోరాటం చేసిన గాంధీజీ భిన్నత్వంలో ఏకత్వం నమ్మారని పరమత సహనం బోధించారని సత్యమేవ జయతే మార్గాన్ని నడిచారని అన్నారు.అటు కేంద్ర ప్రభుత్వం,ఇటు రాష్ట్ర ప్రభుత్వం గాంధీ సిద్ధాంతాల్ని తుంగలో తొక్కుతున్నారని రాబోవు రోజుల్లో గాంధేయ మార్గంలో పయనిస్తామని రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని గాంధీయవాదాన్ని గెలిపిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ మతీన్, కోక ఫణి భూషణ్, లింగాల సుధాకర్ ,కోన నాగార్జున, డాక్టర్ సిహెచ్ అప్పారావు, ఆకురాతి జనార్దన్, లీలా కష్ణ, రాగి రమేష్, చిత్రాల రమేష్ బాబు, ఏరువా ప్రసాద్ రెడ్డి, కే గణేష్ బాబు, వి సురేష్ రెడ్డి, రజియా సుల్తానా, హైదర్ ,చంద్రశేఖర్ ,అఖ్తర్ గౌస్ మొహియుద్దీన్ పేరుశెట్టి నాగరాజు ,చౌదరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఆర్.రఘు, రామరాజు

రోడ్డు ప్రమాదంలో సిపిఎం నాయకులు బివి శ్రీనివాస్‌కు గాయాలు

పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు పరామర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : రోడ్డు ప్రమాదంలో సిపిఎం కృష్ణాజిల్లా నాయకులు బి.వి.శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి కౌలు రైతు సంఘం పనిమీద గుడివాడ బైపాస్‌రోడ్డులో సైకిల్‌పై వెళుతున్న ఆయనను గుర్తు తెలియని వాహనం డీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ గాయపడ్డారు. కుడిచేతి మణికట్టు వద్ద విరిగింది. ప్రమాదం సమయంలో రోడ్డు పక్కనపడిపోయిన శ్రీనివాస్...స్థానిక పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సిపిఎం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి తదితరులు శ్రీనివాస్‌ను గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం విజయవాడకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ప్రమాదం లేదని, శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.వి.శ్రీనివాస్‌ను సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు యు.వి.రామరాజు తదితరులు ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్‌ను పరామర్శించారు.

టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీదేవి

ప్రజాశక్తి - విజయవాడ : ఎంబివికె, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ దివాస్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 86 మంది మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ జి.శ్రీదేవి, ఎంబివికె మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ దివాస్ ప్రెసిడెంట్ వై.స్వరూప, సెక్రటరీ ఎన్.శ్రీ శిల్ప, బాస్టల్ ప్రెసిడెంట్ కవిత ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్థంతి సందర్భంగా జి.శ్రీదేవి, కె.స్వరూపరాణి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎంబివికె మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు యు.వి.రామరాజు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సాధించడంలో కీలకపాత్ర పోషించి, మతసామరస్యాన్ని, లౌకికతత్వాన్ని భారతదేశ ప్రజలలో పెంపొందించి, మతోన్మాదశక్తుల చేతిలో బలైన జాతిపిత మహాత్మాగాంధీ గురించి వివరించారు. ముందుకు ఇన్నర్వల్ క్లబ్ సభ్యులను, ఎం.బి.వి.కె బాధ్యులను ఆయన వేదిక మీదకు ఆహ్వానించారు. ఎంబివికెలో శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన బట్టలను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఎంబివికె, బిఆర్‌టిఎస్ రోడ్, రాణిగారితోట శిక్షణ కేంద్రాల్లో టైలరింగ్ శిక్షణ పొందిన 85 మందికి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె టైలరింగ్ టీచర్ పి.గాయత్రి, బి.మల్లేశ్వరి, కె. ఇందిర, ఎస్.కె. ఆషా పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలు

జిజిహెచ్ సిబ్బంది సేవలు అభినందనీయం : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అనారోగ్యం, ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చేరిన రోగులకు వైద్యులు వైద్యేతర సిబ్బంది అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని, ఆప్యాయత అనురాగంతో మరింతగా సేవలందించడం ద్వారా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉత్తమ సేవలందిస్తున్న వైద్యులు వైద్యేతర సిబ్బందికి మంగళవారం ఆయన ప్రశంసా పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేవ భావంలో వైద్య రంగానికి ప్రత్యేక స్థానముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్ది అత్యాధునిక మౌళిక వసతులతో పాటు వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కరోనా కష్ట కాలంలో వైద్యులు, సిబ్బంది అందించిన నిరుపమాన సేవలు నేటికీ ప్రజల హదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయని కలెక్టర్ అన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ ఎం. వెంకటేష్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

గరంగరం

తీసుకోవాలని డిమాండ్ చేశారు. పునర్నిర్మాణం పేరుతో విద్యాధరపురం కుమ్మరిపాలెంలో గల డిఎస్ఎంసి పాఠశాలను కూల్చేశారని, కానీ సంబంధిత పాఠశాలను అదే ప్రాంతంలో గల మైనంపల్లి పాఠశాలలో కలిపారని పేర్కొన్నారు. త్వరగా ఆ పాఠశాలను నిర్మించాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఇప్పటికే చాలా పాఠశాలల్లో పనులు పూర్తిచేశామని, మిగిలిన వాటిని కూడా త్వరలో పూర్తిచేస్తామని చెప్పారు.

పెన్షన్ల తొలగింపు అన్యాయం : సత్యబాబు

వివిధ కారణాలను సాకుగా చూపుతూ పెన్షన్లు తొలగించడంపై సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన డివిజన్లో మూగ, వృద్ధ మహిళకు పెన్షన్ తొలగించడాన్ని ప్రశ్నించారు. దీనిపై కొంతమంది అధికారపక్ష కార్పొరేటర్లు లేచి తమ ప్రభుత్వ హయంలో ఇంటింటికీ వెళ్లి 1వ తేదీనే పెన్షన్లు ఇస్తున్నామని, గత ప్రభుత్వం కంటే తాము ఎక్కువ పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. మేయర్ స్పందిస్తూ అర్హులు ఉంటే వారికి పెన్షన్లు వచ్చేవిధంగా చూస్తామన్నారు. భవానీపురంలోని లారీ స్టాండ్ విషయమై కూడా సత్యబాబు ప్రశ్నించారు. ముందస్తు అనుమతులు ఇచ్చేటప్పుడు టెండర్లు పిలవకుండా ఏలా పనులు మొదలు పెడతారన్నారు. దీనిపై సర్కిల్-1 ఇఇ నారాయణమూర్తి మాట్లాడుతూ లారీ స్టాండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.58,87,500లను మొత్తం షెడ్డు నిర్మాణం నిమిత్తం ఆమోదం పొందిన రూ.1,55,70,000 నుండి ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం మేరకు మంజూరు చేసినట్లు తెలిపారు. దీనిని టిడిపి, సిపిఎం సభ్యులు తప్పుబట్టారు.

దోమల నియంత్రణలో అధికారుల తీరుపై ఆగ్రహం

గత రెండు నెలలకుపైగా దోమల తీవ్రత ఎక్కువగా ఉండటంతో నగర వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అన్నారు. దీంతో ఈ సమస్యపై ప్రతిపక్ష సభ్యులతోపాటు అధికార పక్ష సభ్యులు కూడా గొంతు కలిపారు. విఎంసి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో పగలు రాత్రి అని లేకుండా దోమల ఉధృతి పెరిగిందని, దీంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారని అన్నారు. ఇంతకు ముందు డ్రైన్లలో మలేరియా సిబ్బంది మందు చల్లేవారని, ఇప్పుడు అలాంటి పనులు చేయటం లేదని సభ్యులు ముక్తకంఠంతో ధ్వజమెత్తారు. మేయర్ మాట్లాడుతూ గత కొంతకాలం క్రితం విఎంసి కార్మికులు సమ్మె చేశారని, ఈనేపథ్యంలోనే దోమల వ్యాప్తి ఎక్కువైందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకునేవిధంగా కమిషనర్ సభ్యులకు వివరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్లలో పూడిక తీసేవిధంగా, శుభ్రంగా ఉండేలా చూస్తామన్నారు. వారంలో ఒక రోజు దోమల నివారణకు మురుగు కాల్వల్లో ఫాగింగ్, స్ప్రే వంటి చర్యలు చేపడతామన్నారు. విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎంఎల్‌ఎలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు అధికార పార్టీకి నేతల పేర్లు పెట్టడం దారుణం : టిడిపి

నగరంలోని కొన్ని రోడ్లకు అధికార పార్టీకి చెందిన వారి పేర్లు పెట్టడం దారుణమని టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, ఆ పార్టీ కార్పొరేటర్ ప్రసాద్ మీడియా వద్ద వాపోయారు. అదేమంటే ఎంఎల్‌ఎలు వెలంపల్లి, మల్లాది ఆదేశాల మేరకు చేశామంటున్నారని, నగరంలో రోడ్లకు తమకు ఇష్టమైన, ఇష్టానుసారం వారి పేర్లు పెట్టి, కౌన్సిల్‌లో చర్చ లేకుండా ఆమోదింపజేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇది కేవలం ఓట్ల రాజకీయంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టిడిపి, సిపిఎం సభ్యుల నిరసన ప్రదర్శన

ముందుగా టిడ్కో గృహాలు వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని, నగరంలో దోమలు, వీధి కుక్కలను నివారించాలని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిడిపి, సిపిఎం సభ్యులు కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన చేసుకుంటూ కౌన్సిల్ హాలులోకి వెళ్లారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు దోమతెరను కప్పుకుని వాటర్ క్యాన్‌ను, నినాదాలతో కూడిన బ్యానర్‌ను చేతబట్టి వినూత్నంగా ప్రదర్శనలో పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతులేవీ ?

(పంచాయతీల్లో కమిటీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా పనులు చేయడం) విధానాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. దీనిలో భాగంగా రూ.171.37 కోట్ల విలువైన 585 పనులను కాంట్రాక్టు కమ్యూనిటీ పద్ధతిలో చేపట్టాల్సి ఉంది.

నత్తనడకన గృహ నిర్మాణాలు

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా జిల్లాలోని జగనన్న కాలనీ లే అవుట్లలో 89,824 మంది లబ్ధిదారులకు స్థలాలు మంజూరయ్యాయి. అయితే ఇప్పటి వరకు 23,083 గృహాలను మాత్రమే లబ్ధిదారులు నిర్మించుకోగలిగారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం చాలకపోవడంతోపాటు కాలనీల్లో కనీసం నీటి సదుపాయం కల్పించకపోవడంతో గృహ నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల వరకు వ్యయం అవుతుంటే ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే లబ్ధిదారులకు ఇస్తోంది. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు వివిధ రూపాల్లో అప్పులు చేసి సమకూర్చుకోవాల్సి వస్తోంది. దీంతో గృహ నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయి. స్థలాలు మంజూరైనా నాలుగో వంతు లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోలేకపోయారు. మూడేళ్ల క్రితం లబ్ధిదారులకు మంజూరైన గృహాల్లో ఎక్కువ పునాదుల దశలోనే ఉన్నాయి. మొత్తం 89,824 గృహాల్లో 45,357 గృహాలు బిలో బేస్మెంట్ (పునాది దశ)లోనే ఉన్నాయి. బేస్మెంట్ లెవల్‌లో 13,282 గృహాలు, రూఫ్ లెవెల్‌లో 2,582 గృహాలు, రూఫ్ కాస్టు లెవెల్‌లో 1,384 గృహాలు ఉన్నాయి.

బాపూజీ మార్గంలో పయనిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛ స్వాతంత్రాలను అందించిన మహనీయుడు జాతి పిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో పయనించి ప్రజలకు సేవలందిద్దామని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 76వ వర్ధంతి అమరవీరుల దినోత్సవ సందర్భంగా మంగవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన...జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాతి సమగ్రత, ఐక్యతను పెంపొందించేందుకు పూజ్య బాపూజీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. నిత్యం అహింసాయుత మార్గంలో సత్యమే పరమావధిగా జీవించిన మహనీయుడు మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారన్నారు. ఈకార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ యం.వెంకటేష్ పాల్గొన్నారు.


ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె

సెర్ప్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్



గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె విరమించేది లేదని సెర్ప్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కన్వినర్ సి హెచ్ తిరుపతయ్య స్పష్టం చేశారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని,పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జె ఏ సి పిలుపు మేరకు కలక్టరేట్ ధర్నా చౌక్ లో జిల్లా సెర్ప్ ఉద్యోగులు చేస్తున్న నిరవదిక సమ్మె మంగళవారం ఏడో రోజుకి చేరుకుంది. గాంధీజి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ లైన పే స్కేల్ మరియు రెగ్యులరైజేషన్ పై గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం దష్టికి తీసుకు వస్తున్నప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఉద్యోగులందరికి కేడర్ ఫిక్స్ చేస్తూ పే స్కేల్ అమలు చేసి సర్వీస్ ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సెర్ఫ్ ఉద్యోగుల సర్విస్ క్రమబద్ధీకరణకు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ వద్ద ఉన్న శాంక్షన్ పోస్టులుగా గుర్తిస్తూ ఇచ్చిన ఫైల్ను జిఓ రూపంలో ఇవ్వాలన్నారు. అలాగే ఇ పి ఎఫ్ పై ఉన్న సీలింగ్ విధానం తీసివేసి మూల వేతనంపై వంద శాతం ఇపిఎఫ్, అమలు చేయాలన్నారు.హెచ్ ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపు చేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు ఈ సమ్మెలో జిల్లా జేఏసీ నాయకులు కార్యదర్శి సిహెచ్‌వివి బాపనయ్య. వై.రాజా గోవింద్, డి.శ్రీనివాస్, ఎం.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



ధాన్యం బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం: వీరపనేనిగూడెం, మెట్లపల్లి గ్రామాల పరిధిలోని రైతులకు ధాన్యం బకాయలు చెల్లించాలని కోరుతూ మంగళవారం గన్నవరం రెవిన్యూ అధికారులకు రైతుల వినతి పత్రం సమర్పించారు. వీరపనేని గూడెం మెట్లపల్లి గ్రామాల పరిధిలో 5,316 బస్తాల ధాన్యాన్ని ఆర్‌బికె ద్వారా మిల్లర్లకు అమ్మినట్లు తెలిపారు. ధాన్యం తోలి నెలరోజులు అవుతున్న ఇంతవరకు డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. బకాయిల చెల్లింపుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో 25 మంది రైతులు పాల్గొన్నారు.

200 మందికి అన్నదానం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో 200 మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.మంగళవారం కావడంతో తెల్లవారుజాము నుండి యాత్రికులు అత్యధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.ముందుగా అర్చకులు స్వామివారి ఆలయానికి ప్రత్యేక



అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణకి రేమల్లె గ్రామానికి చెందిన తుమ్మల రవి కాంత్, శశికళ దంపతులు సహకరించారు. దేవాలయ సాంప్రదాయం ప్రకారం దాత తుమ్మల రవికాంత్‌ను ఈవో కూచిపూడి శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నేర్సు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికి టిడిపి కృషి

ప్రజాశక్తి-పమిడిముక్కల: వెనుకబడిన తరగతులకు చెందాల్సిన బీసీ కార్పొరేషన్ రుణాలను వైయస్ జగన్మోహన్‌రెడ్డి దారి మళ్లించారని, బీసీల అభ్యున్నతికి టిడిపి కృషి చేసిందని పామర్రు టిడిపి వర్ల కుమార్‌రాజా అన్నారు. వీరంకులాకుల వద్ద బీసీ సదస్సు మంగళవారం జరిగింది. 75 వేల కోట్ల నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. బీసీలంతా సంఘటితంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కొనగల బుల్లయ్య, బత్తిన వాసు, వీరంకి పరుశురాం, మద్రివాడ సర్పంచ్ వంపుగాళ్ల ఫ్రాన్సిస్, రాజులపాటి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తహశీల్దార్ వనజాక్షికి సన్మానం

ప్రజాశక్తి-ఉంగుటూరు: తహశీల్దార్ దోనవల్లి వనజాక్షి బదిలీపై వెళుతున్న నేపథ్యంలో మంగళవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ వనజాక్షి ఎక్కడ పనిచేసిన తన సిబ్బందిని తన బిడ్డలుగా భావించి వారిని ఏ సమస్యనైనా సున్నితంగా పరిష్కరించే వారిని అదే విధంగా ఉంగుటూరు మండలంలో కూడా ప్రతి సమస్యని మండలంలో ఉన్న ప్రముఖుల ద్వారా పరిష్కారానికి ఎనలేని కషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీలత, మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్, ఎంఈఓ 2 సాంబశివరావు, విఆర్వో అసోసియేషన్ నాయకులు తంబి, ఆర్‌ఐ శంకర్ పాల్గొన్నారు.





నందివాడలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-గుడివాడ(నందివాడ) : గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నందివాడ గ్రామంలో 2వ రోజు బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం హై స్కూల్ వద్ద మంగళవారం ప్రారంభమైంది. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని, టిడిపి జనసేన మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ శ్రీకాంత్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, ఆరెకపూడి రామశాస్త్రులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లు కోరుతూ ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కవరం శివారు కండ్రికలో ఆయన స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా పాలకులు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మాటలు తప్ప చేతలు లేవన్నారు. ఇప్పటికైనా వర్గీకరణ బిల్లు పెట్టాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణంలోని ఉపద్రష్ట సత్రంలో శ్రీ త్యాగబ్రహ్మ వైభవ ప్రకాశ సభ, ఉపద్రష్ట ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శ్రీత్యాగరాజ స్వామివారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత సంగీత విద్వాంసులు పోపూరి శ్యామసుందర్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ ఉత్సవ సంప్రదాయ, దివ్యనామ సంకీర్తనలను గానం చేస్తూ సంప్రదాయబద్ధంగా ఉంఛవత్తి, పూజా కార్యక్రమం చేశారు. విజయవాడకు చెందిన పసుమర్తి కామేశ్వరశర్మ శ్రీ త్యాగరాజస్వామి రచనలపై ప్రసంగం చేశారు. అనంతరం సంగీత విద్వాంసులు, సంగీత కళాకారుల ఆధ్వర్యంలో పంచరత్న కతుల గోష్ఠిగానం ఆద్యంతం వీనుల విందుగా జరిగింది. ఈ గోష్ఠిగానంలో పోపూరి శ్యామసుందర్, గజ్జల సతీష్‌బాబు, రఘునాథ్, శ్రీదేవీ, ప్రవల్లిక, వైష్ణవి, శివరంజని, ప్రణతి, సముద్యత, నాగనంది, మిహిక, సుభద్ర, శ్యామల,



విజయలక్ష్మి, మల్లేశ్వరమ్మ, బాలాకుమారి, వర్ధని, హేమలత తదితర సంగీత కళాకారులు పాల్గొని అద్భుతంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఉపద్రష్ట రామస్వామిశాస్త్రి, నాగేశ్వరరావు, చావలి శ్రీనివాస్, కందుల అనిల్‌కుమార్, సూర్య, తుమ్మిడి భద్రయ్యలు పాల్గొన్నారు.

ఎప్పటికైనా నిజమే గెలుస్తుంది : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: నిజం నిప్పులాంటిదని ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని చంద్రబాబు నాయుడు పై ఈ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో సుప్రీం కోర్టుతీర్పు ఇందుకు నిదర్శనమని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. అక్రమ కేసులతో చంద్రబాబు నాయుడుని ఇబ్బంది పెట్టాలని చూసిన ఈ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. 40ఏళ్ళ రాజకియ జీవితంలో అవినీతి మచ్చలేని చంద్రబాబు నాయుడు పై బురద జల్లి లేనిపోని కేసుల్లో ఇరికించి ఇబ్బంది పెట్టాలని చూడటం ఈ ప్రభుత్వాన్ని తగదని హితవు పలికారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఈ ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. పాలకులు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా టిడిపి వైపు ఉన్నారని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను రా కదలి రా సభల ద్వారా చంద్రబాబు నాయుడు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, ఈ సభలకు ప్రజల నుండి భారీ స్పందన వస్తుందని తెలిపారు. చంద్రబాబు సభలకు ప్రజల నుండి వస్తున్న ఆదరణ చూసి వైసిపి నాయకులు దిక్కుతోదని స్థితిలో పడిపోయారని ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ నియోజకవర్గంలోని పలువురు సమస్యలను మంగళవారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)కి తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి స్వగృహంలో ఈ మేరకు పట్టణానికి చెందిన పలువురు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ సేవాధికారి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కెవి. రామకృష్ణయ్య సూచించారు.లింగ వివక్షత నిర్మూలన మరియు మహిళల హక్కులు నిబంధనల రక్షణ పై జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ అవగాహాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామ కష్ణయ్య మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యము నల్సా విధివిధానాలను మరియు ఆదేశాలను అమలు చేయడం, సమాజంలోనీ బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలను అందించుట, వివాదాలను



సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక అదాలత్ నిర్వహణ మొదలగు అంశాల గురించి సవివరంగా వివరించడం జరిగింది. దీనికి సంబంధించి ప్రతి జిల్లాలో "జిల్లా న్యాయ సేవాధికార" కార్యక్రమాలను అమలు చేయటానికి జిల్లా న్యాయ సేవల అథారిటీ జిల్లా కోర్టు సముదాయాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాబట్టి ప్రజలు సద్వినియోగం చేసుకొని ఉచిత న్యాయ సహాయం పొందాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. గీతా బాయి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల , నర్సింగ్ కేంద్రాల , లేబరేటరీల యాజమాన్యాలు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని మరియు మానసిక ఆరోగ్య రక్షణ చట్టం మొదలైన చట్టాల పరిధికి లోబడి పని చేయలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ సీతాకుమారి, డాక్టర్ విజయభారతి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ నాగభవానీ, కుటుంబ డాక్టర్ విధాన, బి శివసాంబిరెడ్డి, బి రాజేంద్ర కుమార్, న్యాయవాది సిహెచ్ ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎం కెజి విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పటమట ఎన్‌ఎస్‌ఎం పబ్లిక్‌స్కూల్ కె.జి.విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు మంగళవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి పెంపొందించు కోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎం పాఠశాల విద్యార్థులకు మంచిస్కిల్స్‌ను అందిస్తుందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి మాట్లాడుతూ మననగరానికే తలమానికంగా నిలిచిన యన్‌ఎస్‌ఎం పబ్లిక్‌స్కూల్ ఎల్లప్పుడూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతుందన్నారు. అనంతరం పాఠశాల చిన్నారులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బ్రదర్ మోంట్‌ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

చెస్‌లో సత్తా చాటిన రాకేష్ స్కూల్ విద్యార్థిని సోనికా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం కెఎల్ రావు నగర్‌లో గల రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న డి. సోనికా అనే విద్యార్థిని చెస్‌లో సత్తా చాటుకుంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో సోనికాకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.రావు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో 2023 డిసెంబర్ 31న ఓజిసిఎ అండ్ బ్రెయిన్ జిమ్ ఆలిండియా ఓపెన్, చిల్డ్రన్స్ చెస్ టోర్నమెంట్ అండర్-12 విభాగంలో తమ పాఠశాల విద్యార్థి సోనిక ప్రథమ స్థానం సాధించటం అభినందనీయమన్నారు. ఈ నెల 25 నుండి 28 వరకు సెకండ్ ఫైడ్ ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో కూడా తమ విద్యార్థి సోనికా ద్వితీయ బహుమతి సాధించిందని తెలిపారు. రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తెచ్చేలా కృషిచేయాలని, మరిన్ని అవార్డులు తెచ్చుకొనేలా సోనికా ఏషియన్స్ గేమ్స్‌లో ఆడే స్థాయికి చేరాలని ఎన్‌వి రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సురేఖ, కరుణ, షకీలా, మల్లీశ్వరీ, సాధికా, ఆర్. మల్లీశ్వరీ, ఝాన్సీ, తోటి విద్యార్థినీ విద్యార్థులు అభినందించారు.



సోనికాను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ డా.ఎన్‌వి రావు, ఉపాధ్యాయులు

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.99 కోట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ హుండీ లెక్కింపు మంగళవారం మహామండపం ఆరో అంతస్తులో జరిగింది. ఈ సందర్భంగా 20 రోజులకు సంబంధించి హుండీలను లెక్కించగా నగదు రూ.2,99,68,935లు, బంగారం:648 గ్రాములు, వెండి: 5 కేజీల 610 గ్రాములు యాత్రికులు హుండీల ద్వారా సమర్పించుకున్నారు. ఇక విదేశీ కరెన్సీ ద్వారా యుఎస్‌ఏ- 542 డాలర్లు, ఓమన్ - 1.5 రియాల్స్, ఇంగ్లాండ్ - 20 పౌండ్లు, కెనెడా - 100 డాలర్లు, ఆస్ట్రేలియా - 20 డాలర్లు, యూరో- 20 యూరోలు, సింగపూర్ - 35 డాలర్లు, మలేషియా- 1 రింగెట్, యుఏఇ- 105 దిర్హమ్స్, కువైట్ - 0.5 దినార్, హాంకాంగ్ - డాలర్లు, సౌదీ - 11 రియాల్స్, న్యూజిలాండ్ - 20 డాలర్లు, సౌత్ ఆఫ్రికా - 100 ర్యాండ్‌లు, ఖతార్- 55 రియాల్స్ భక్తులు సమర్పించారు. అలాగే ఆన్‌లైన్ ఈ- హుండీ ద్వారా రూ.67,230లు భక్తులు సమర్పించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఛైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు, పాలకమండలి సభ్యులు కట్టా సత్తయ్య, సహాయ కార్యనిర్వాహణాధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్‌పిఎఫ్ మరియు వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, భవానీ సేవా దారులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఇఒ రామారావు, ఛైర్మన్ కర్నాటి రాంబాబు తదితరులు

ట్రాక్టర్ ఇంజన్లు, వాటర్ ట్యాంకర్లు అందజేత

ప్రజాశక్తి - తిరువూరు : కమీషన్ల కోసం చంద్రబాబు చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.ఐదువేల కోట్లతో ఎలక్షన్ ముందు శంకుస్థాపన చేశారని వైసిపి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ఆరోపించారు. తిరువూరు నగర పంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంపి నిధులతో కొనుగోలు చేసిన మూడు ట్రాక్టర్ ఇంజన్లు, 5 వాటర్ ట్యాంకర్లను అయన మంగళవారం అయన వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరి బాయి, కౌన్సిలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం పరిధిలో 65 వాటర్ ట్యాంకర్లను తన నిధుల ద్వారా గ్రామ పంచాయతీలకు అందజేశానన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలన అవినీతిమయంగా జరిగిందన్నారు. ఏ.కొండూరు ప్రాంతంలో కిడ్నీ రోగుల గురించి చంద్రబాబు ఏరోజూ పట్టించుకోలేదన్నారు. ధనికుల పిల్లలతో చదువులో పోటీ పడేలా పేద పిల్లల కోసం నాడు నేడు ద్వారా ప్రభుత్వ విద్యాలయాలను సిఎం జగన్ అభివద్ధి చేస్తుంటే చంద్రబాబు పాలనలో నిర్వీర్యం అయ్యాయని చెప్పారు. తమలాంటి వ్యక్తులను దూరం చేసుకున్న చంద్రబాబుకు సరైన గుణపాఠం వస్తుందన్నారు.



ఇంజన్లు, ట్యాంకర్ల అందజేతను ప్రారంభిస్తున్న నాని



ఎల్‌బిఆర్ సిఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : జెఎన్‌టియు కాకినాడ సెంట్రల్ జోన్ సాఫ్ట్‌బాల్‌లో ఎల్‌బిఆర్ సిఇ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానం సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు మంగళవారం తెలిపారు. జెఎన్‌టియు కాకినాడ సెంట్రల్ జోన్ సాఫ్ట్‌బాల్ (మెన్) ఇంటర్ కాలేజే టోర్నమెంట్ సెలక్షన్స్ ఈ నెల 29న స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగాయన్నారు. ఈ పోటీల్లో మొత్తం ఆరు టీమ్‌లు పాల్గొనగా లకిరెడ్డి బాల్రెడ్డి కళాశాల ప్రథమ స్థానం, ఎస్ఆర్‌జిఇసి గుడ్లవల్లేరు ద్వితీయ, విఎస్ఆర్‌ఈసి విజయవాడ తృతీయ, ఎన్నారై ఆకిరిపల్లి నాలుగో స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎల్‌బిఆర్‌సి విద్యార్థులు సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

నేటి నుండి గుణదల మేరీమాత నవదిన ప్రార్థనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గుణదల మేరిమాత నూరు వసంతాల మహోత్సవాల నవదిన ప్రార్థనలు బుధవారం నుండి ప్రారంభం కానున్నాయి. గుణదల మేరిమాత మహోత్సవాలలో భాగంగా ముందుగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే నవదిన ప్రార్థనలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవరెంట్ ఫాదర్ సునీల్‌రాజు తెలిపారు. వేడుకలలో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. పుణ్యక్షేత్రం కొండపై రెండో మలుపు వద్ద శతాబ్ది వేడుకలకు గుర్తుగా నూతనంగా నిర్మించిన స్మృతివనంను బిషప్ రాజారావు లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. పుణ్యక్షేత్రం అభివృద్ధికి గతంలో పాటు పడిన పూర్వపు పీఠాధిపతులు డోమ్నిక్ గ్రాషి, అబ్రోస్ డి.బతిస్థా, ఫాదర్ అర్లాటి, ఫాదర్ బియాంకి, యరబదర్ బెర్తోలి, బ్రదర్ క్రిప్పా, బ్రదర్ జియాని 100 సంవత్సరాల వేడుకలకు గుర్తుగా ప్రతిష్టించిన నూతన విగ్రహాలను బిషప్ రాజారావు అట్టహాసంగా ఆవిష్కరిస్తారన్నారు.

టిటి జట్లు ఎంపిక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఫిబ్రవరి 1వ తేదీ నుండి 3వ తేదీ వరకు చెన్నయ్‌లోని డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్శిటీలో జరుగనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పురుషుల టోర్నమెంట్‌లో పాల్గొనే డాక్టర్ వై.ఎస్.ఆర్. యూనివర్శిటీ జట్టును ఎంపికచేసినట్లు వర్శిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జట్టులో ఎ.నితిన్ ఆరాస్, జి.అభినవ్ చౌదరి (ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల - చినకాకాని), కె.అఖిల్, ఎ.నవీన్ సాయిరామ్ (కాటూరి మెడికల్ కళాశాల - చినకొండ్రుపాడు), పి.జస్వంత్ (గ్రేట్ ఈస్ట్రన్ మెడికల్‌స్కూల్ - శ్రీకాకుళం) ఎంపికయ్యారని తెలిపారు. కోచ్ కమ్ మేనేజర్‌గా కె.నాగరాజు, వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన జట్టుకు డాక్టర్ వై.ఎస్.ఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి అభినందించారు.



అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ కొత్త ప్రాజెక్టులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ రెండుకొత్త ప్రాజెక్టులను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధికె.ఎస్.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అపర్ణ న్యూలాండ్స్, అపర్ణ సరోవర్ టవర్స్ పేర్లతో రెండు గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్ ప్రాజెక్టులను రు. 2425 కోట్లతో ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత డిమాండ్ ఉన్న తెల్లాపూర్, నల్లగండ్ల ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులను రూపకల్పన చేయనున్నామని తెలిపారు. ఇవి దాదాపు 1475 చదరపు అడుగుల నుండి 3,700 చదరపు అడుగుల వరకు వ్యక్తిగత యూనిట్ పరిమాణాలను అందిస్తాయన్నారు. ఈ ప్రాజెక్టు ఆవిష్కరణ అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్లో అగ్రగామిగా ఉండాలనే కంపెనీ ప్రయత్నాలకు నిలయంగా ఉంటుందన్నారు.

అభివృద్ధిలో జెఎస్‌డబ్ల్యూ పెయింట్స్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ పర్యావరణ అనుకూల పెయింట్స్ కంపెనీ జె.ఎస్.డబ్ల్యూ పెయింట్స్ గణనీయమైన వృద్ధిని సాధించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.రామరాజు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కంపెనీ వివరాలను తెలిపారు. ఐదు సంవత్స రాల క్రితం జె.ఎస్.డబ్ల్యూ పెయింట్స్ కార్యకలాపాలను ప్రారంభిం చిందని, నాటి నుండి నేటి వరకు ఎంతో మందికి సేవలను అందించినట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధితో పాటు అధికవృద్ధిని కూడా సాధించినట్లు తెలిపారు. 2022లో రూ.1000 కోట్ల కంపెనీ తరువాత ఇపుడు కేవలం 15 నెలల్లో 2 కోట్ల రన్ రేట్‌ను సాధించినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 9 నెలల్లోపునే రూ.1500 కోట్ల మార్కును సాధించినట్లు తెలిపారు.

శామ్‌సంగ్ గెలాక్సీ 23 రెట్టింపు అమ్మకాలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : శాంసంగ్ గెలాక్సీ పరికరాల్లో గెలాక్సీ ఎస్ 23 సిరీస్ అమ్మకాలు రెట్టింపు జరిగాయని శాంసంగ్ ఏరియా మేనేజర్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని శాంసంగ్ మార్కెటింగ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. గెలాక్సీ ఎస్23 శక్తివంతమైన పనితీరు, ఎపిక్ కెమేరా సామర్థ్యాల కారణంగా మంచి అమ్మకాలు జరిగాయని తెలిపారు. ఒక బిలియన్ కంటే ఎక్కువ గెలాక్సీ కస్టమర్లతో మొబైల్ పరిశ్రమలో శాంసంగ్ అగ్రగామిగా ఉందని తెలిపారు. దీనితో రెట్టింపు ఉత్సాంగా గెలాక్సీ ఎస్ 24 సిరీస్ అమ్మకాలు కూడా గణనీయంగా పెరుగుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఐకియా డోర్ డెలివరీ సేవలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అత్యంత ప్రాచుర్యం పొందిన గృహోపకరణాల రిటైల్ ఐకియా డోర్ డెలివరీ సేవలనువిస్తృతం చేసినట్లు సంస్థ మేనేజర్ ఐ.ప్రసాద్ తెలిపారు. మొగల్‌రాజపురంలోని సంస్థ కార్యాలయం నందుబుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈకామర్స్ సేవలను విస్తృతంచేశామని రానున్న కాలంలో ఐకియా సేలను మరింత విస్తృతంచేయాలనే ఉద్దేశంతో వినూత్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐకియా స్టోర్ సమీపంలోని కస్టమర్ల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.